క్లుప్తంగా

వన సంరక్షణ అందరి బాధ్యత



గురజాల: వన సంరక్షణ అందరి బాధ్యత అని నగర పంచాయతీ కమిషనర్ చెన్నయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో పెరిగిపోతున్న కాలుష్య నివారణకు మొక్కలు నాటడం పరిష్కారమన్నారు. ప్రతి విద్యార్థి మొక్కను నాటి దానిని సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు అభినందనలు



మాచర్ల: పురపాలక సంఘ నూతన చైర్మన్‌గా ఎంపికైన పోలూరి నరసింహారావును శుక్రవారం పలు అసోషియేషన్ సంఘ నాయకులు కలసి శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. పట్టణంలోని మెడికల్ అసోషియేషన్ హాలులో దాల్ మిల్, రైస్, కూరగాయల మార్కెట్, ఫెస్టిసైడ్స్, క్లాత్ మర్చంట్స్ అసోషియేషన్, సినిమా థియేటర్ యజమానులు కలిసి అభినందించారు. పట్టణానికి చెందిన పలు వార్డుల టీడీపీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆయనను కలిశారు.

నోట్ బుక్స్ పంపిణీ



మాచర్ల: అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో జెండా చెట్టు వద్ద ప్రభుత్వం ఉర్దూ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్ బుక్స్, ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ఎంఈఓ సురేష్ పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించిన ఫౌండర్ ఎస్కే పాషా వలిని అభినందించారు. అబ్దుల్ కలాం అడుగు జాడల్లో నడవాలని విద్యార్థులకు సూచించారు. గౌరవ అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్కే జలీల్, టీడీపీ నాయకులు మదర్ సాహెబ్, ముస్లిం సేవా సమితి అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, తెలుగు యువత నాయకులు పఠాన్ బాబు ఖాన్ స్కూలు అభివృద్ధికి తమ తోడ్పాటునందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు అంజిబాబు శంకర్, అబ్దుల్ కలాం యూత్ నాయకులు బషీర్ పాల్గొన్నారు.

పాఠశాలలో వనం - మనం



విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వనం-మనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ రామ్ చందు నాయక్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కను నాటి ప్రకృతిని రక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఉప్పలూరి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధిలో గల వీరమ్మ కాలనీలోని వృద్ధాశ్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లలు, వృద్ధులు, మహిళలకు బీపీ, షుగర్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రతీ నెలలో ఒకరోజు ఆశ్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎం శారద, సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, ఆశ కార్యకర్తలు సుజాత, మరియమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

బెల్లంకొండ: కౌమార దశలో ఉన్న బాలికలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్ఓ ఎం.ఝాన్సీ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం 'కౌమార స్నేహ పూర్వక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి, చెడు స్పర్శలను ఏ విధంగా గుర్తించాలో పాఠశాలలోని బాలికలకు అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే సెల్ఫ్ ప్రొటెక్షన్ అలవర్చుకోవాలని, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వివాహ వయసు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్ఎం బలరాం నాయక్, చైర్మన్ దీపాల కోటేశ్వరరావు, ఏఎన్ఎం సాగర్ మాత, ఉపాధ్యాయులు నాగ లక్ష్మి, అరుణ కుమారి, అల్లాబి, స్వాతి, ఫర్జానా, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణ విషయంలో ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. రోగి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోతే విధులు నిర్వర్తించలేం. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలుని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

– వడితె ఝాన్సీబాయి,
ఎంఎల్‌హెచ్‌పీ, వెంకటాయపాలెం, బెల్లంకొండ



వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మహిళా వైద్య సిబ్బందికి విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించాలి. తగిన రక్షణ కల్పించాలి.

– తిరుపతమ్మ,
ఎంఎల్‌హెచ్‌పీ, మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ



క్రీడలతో మానసికోల్లాసం

పిడుగురాళ్ల: విద్యార్థులు క్రీడలతో మానసికోల్లాసం పొందుతారని జీపీ రెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురజాల నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. 11 పాఠశాలల జట్లు తలపడ్డాయి. పిడుగురాళ్ల జీపీ రెడ్డి గ్రూప్ స్కాలర్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. రూ.15 వేల ప్రైజ్ మనీ, మెమెంటో, సర్టిఫికెట్లను అందుకున్నారు. రన్నర్స్ మాంటిస్సోరీ స్కూల్ జట్టుకు రూ.10 వేలు నగదు అందించారు. తృతీయ స్థానంలో నిలిచిన నర్సరావుపేటలోని హిందూ స్కూల్ జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు. గత మూడేళ్ల నుంచి కబడ్డీ పోటీల్లో స్కాలర్స్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేస్తున్నారు. పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీశ్వరరెడ్డి, ఆవుల జనార్దన్‌తో పాటు పీఈటీలు రామారావు, సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



సర్టిఫికెట్లు, కప్‌తో క్రీడాకారులు, డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

పాత పెన్షన్ విధానం ఆమోద యోగ్యం

పిడుగురాళ్ల: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సరోజకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ... ఇటీవల కేంద్రం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ఎంత మాత్రం ఉపయోగకరమైనది కాదని, ఈ విధానం మోసపూరితమైనదన్నారు. తమకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. తమకు ఎలాంటి కొత్త పెన్షన్ స్కీమ్‌లు సమ్మతం కాదని ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ కాశీం పీరా, ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జమాల్, చంద్రశేఖర్, సాంబశివరావు, సాయిబాబా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీటీ సరోజకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పొగాకు ఉత్పత్తులకు దూరం ఆరోగ్య హితం

ముప్పాళ్ల: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఆయా గ్రామాల వైద్య సిబ్బంది పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ముప్పాళ్లలో జరిగిన కార్యక్రమంలో వైద్యురాలు రమాదేవి పాల్గొని, మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల దీర్ఘకాలిక వ్యాధులతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అనంతరం ప్రధాన కూడళ్ల, పోలీస్ స్టేషన్ వద్ద పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ రూపొందించిన వాల్ పోస్టర్‌లను అతికించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్ఫిన్ రాణి, ఏఎన్ఎంలు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోళ్ళపాడు యూపీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భవిష్యత్‌లో ఏఐ విప్లవం

సత్తెనపల్లి: భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో విప్లవాత్మకం కానుందని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ కె.హేమంత్ కుమార్‌రెడ్డి (సీఎస్ఈ), డాక్టర్ ఎం.దుర్గాప్రకాష్ (ఈసీఈ) అన్నారు. మండలంలోని కంటిపూడి సమీపంలోని వరప్రసాద్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు శుక్రవారం 'టెక్ ఆఫ్ ది ఎరా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏఐపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్, సీఎస్ఈ హెచ్ఓడీ ప్రొఫెసర్, పాల్సన్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఇద్దరికి 'గిడుగు రామ్మూర్తి' పురస్కారాలు

సత్తెనపల్లి: మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లికి చెందిన ఇద్దరికి గిడుగు వెంకట రామమూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత గురువారం మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. కళాకారుడు యూవీ రత్నం ఆధ్వర్యంలో సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి, వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్‌కు రంగస్థలం నుంచి పురస్కారాలు అందుకున్నారు. రవి కుమార్ హాజరు కాలేకపోవడంతో రెండు పురస్కారాలను రమాదేవి స్వీకరించారు. పురస్కార గ్రహీతలను పట్టణంలోని వివిధ కళా సంస్థల అధినేతలు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.



రేపు మెగా రక్తదాన శిబిరం

పిడుగురాళ్ల: జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలోని కె.కన్వెన్షన్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు శిబిరంలో పాల్గొనాలని పేర్కొన్నారు. సూచించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు తెలిపారు. జన సైనికులు, మెగా అభిమానులు రక్తదానం చేయాలన్నారు.

ఉపాధ్యాయ సర్దుబాటులో లోపాలు సరిచేయాలి

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి ఆన్‌లైన్ నమోదు, ఆన్‌లైన్ సర్దుబాటు వలన అనేక సమస్యలు వస్తున్నాయని వెల్లడించారు. ప్రతి ఏడాది జరిగే ప్రక్రియను ప్రస్తుతం జటిలం చేశారని విమర్శించారు. జీవో నంబర్ 84 ప్రకారం జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మేనేజ్‌మెంట్ వారీగానే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాల్సి ఉంటుందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో వెంటనే ప్రమోషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించి ప్రమోషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే సర్దుబాటు చేయాలని చెప్పారు. దీనికి గాను మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితా సిద్ధం చేసి ఆ తర్వాత మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. సీనియర్లు విల్లింగ్ ఇస్తే తప్పక ఆమోదించాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యాయులను మున్సిపాలిటీల్లో సర్దుబాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జీవో 84 వలన ఉపయోగం లేనప్పుడు ఆ జీవోను రద్దు చేసి మున్సిపల్ పాఠశాలలకు అర్బన్ ఎంఈవోను నియమించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో నింపే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, షేక్ జమీర్‌బాషు, షేక్ ఫరీసా, ఎస్ కాలేషా, ఐ అంకమ్మరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మస్తాన్‌కు అభినందనలు

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన – అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వినుకొండ అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్ షేక్ మస్తాన్ ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడగా మస్తాన్ 189 ఓట్ల అత్యధిక మెజార్టీతో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. పలువురు అభినందనలు తెలియజేశారు.

అమ్మవార్లకు బోనమెత్తని భక్తజనం



కుంకుమ బండి వెంట బోనాలతో భక్తులు



అంకాలమ్మ చెంతకు తరలివెళ్తున్న భక్తులు



వెండిపూతలో గంగమ్మతల్లి



బుగ్గమల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ



శ్రీ రామకృష్ణ గో సంరక్షణ శాలలో ప్రత్యేక పూజలు

కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. పల్నాటి సర్వ సైన్యాధ్యక్షుడు కన్నమదాసు వీరాచారాన్ని పాటిస్తున్న కారెంపూడి మాలలు అమ్మవారికి కుంకుమ బండి కట్టారు. మహిళలు బోనాలతో కుంకుమ బండి వెంట ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి, పాత పాటేశ్వరమ్మ ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు, పోతురాజుకు నైవేద్యం అర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కారెంపూడిలో పండగ వాతావరణం నెలకొంది. శ్రావణ మాసంలో శుక్ర, ఆదివారాల్లో అమ్మవారికి గ్రామంలోని సమస్త సామాజిక వర్గాలు వంతుల వారీగా బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తిశ్రద్ధలతో పూజలు

రెంటచింతల: శ్రావణ శుక్రవారం స్థానిక శారదా నగర్ కాలనీలోని శ్రీ రామకృష్ణ గో సంరక్షణశాలలో శ్రీరామకృష్ణ సేవా మండలి ఆధ్వర్యంలో శివలింగం ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు పూజలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు శ్రేష్టి శ్రీనివాసశర్మ, అనిల్ కుమార్‌శర్మ నేతృత్వంలో అభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాలువాయి జంక్షన్ వద్ద కనకదుర్గమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. శ్రీరామకృష్ణ సేవా మండలి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి, పి.రాముడు, నాళం పెదబాబు, కె.సైదులు, అంజమ్మ, తంగిరాల లత, పల్లెర్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వెండిపూత అలంకరణలో గంగమ్మ తల్లి

పిడుగురాళ్ల: గంగమ్మతల్లి దేవాలయంలోని ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం గంగమ్మ తల్లి విగ్రహానికి వెండి పూతతో ప్రత్యేక అలంకరణను ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనార్థం ఉంచారు. మహిళా భక్తులు విశేషంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయురారోగ్యాలతో చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు

మాచవరం: శ్రావణ మాసం చివరి శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోర్జంపాడు శ్రీ బుగ్గ మల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామివార్లను దర్శించుకున్నారు.

మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరావు



మాచర్ల: మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి పి.నాగేశ్వరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన వెంకట దాస్ గిద్దలూరుకు బదిలీ అయ్యారు. నాగేశ్వరావు మాట్లాడుతూ పట్టణంలో మొత్తం వివిధ రకాల సామాజిక పింఛనుదారులు 6,468 మందికి రూ.2.79 కోట్లు శనివారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

మాచర్లలో భారీ వర్షం


విజయపురిసౌత్: మాచర్ల పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు వర్షం భారీగా కురిసింది. 60 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. చాలా రోజులుగా వర్షాలు కురవక ఎదురుచూస్తున్న ప్రజలకు ఊరటనిచ్చింది. డ్రెయినేజీలు, కాల్వలు పొంగిపొర్లాయి. రైల్వే స్టేషన్, రింగ్ రోడ్డు, సొసైటీ కాలనీ రహదారి, పురపాలక సంఘానికి వెళ్లే రహదారిలో వర్షపు నీరు భారీగా నిలిచింది. అక్కడక్కడా గుంతలు పడ్డాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని 22/132 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల దృష్ట్యా పిడుగురాళ్ల పట్టణంతో పాటు జూలకల్లు, జానపాడు, అనుపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ శాఖ ఏఈ శివనాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి, సహకరించాలని పేర్కొన్నారు.

వాసవీ మాతకు విశేష అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణ గావించారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమ, మని ద్వీప వర్ణ, అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. పట్టణంలోని భవానీ నగర్‌లో ఉన్న కనక దుర్గమ్మ దేవాలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేపట్టారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత



కనక దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

దాచేపల్లి: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. కేసానుపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీడీఏ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడి, జీవ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. విత్తనం శుద్ధి తప్పక చేయించాలని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపించాలని ఆమె సూచించారు. ఏవో డి.పాపకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని, దీంతో ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, పంట రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌పీ ప్రవీణ్, వీఏఏ రమేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాన్ని విత్తుకోవాలి

రెంటచింతల: నాణ్యమైన విత్తనాన్ని సరైన సమయంలో..సరైన ధరకు రైతులకు అందజేయడమే గ్రామ విత్తన పథకం లక్ష్యమని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. శుక్రవారం రెంటచింతలలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు విత్తన పథకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిక చేసుకున్న విత్తనాన్ని శుద్ధి చేసుకుని నారుమడిలో చల్లుకోవాలని డీడీఏ సూచించారు. 25 నుంచి 30 రోజుల నారుతో నాట్లు వేసుకోవాలని చెప్పారు. నారు పీకే వారం రోజుల ముందు ఐదు సెంట్లు నారు మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవడం మంచిదన్నారు. పిలకలు పెట్టడం అయిపోతున్న సమయంలో కేలిలు తీసివేయాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి. ప్రవీణ్ విత్తన తరగతులు, మొలక శాతం పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి, వీఏఏ గొంటు కృష్ణారెడ్డి, వీహెచ్ఏ పవన్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

ముటుకూరులో వైద్య సేవలు

దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామంలో దుర్గి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ఇతర అనారోగ్య సమస్యలున్న వారికి వైద్య సేవలందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పరిశుభ్రమైన నీటినే తాగాలని గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్లు ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ సామ్రాజ్యం, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు సేవలందించారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎస్కే మాబుసుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రఘురాం నగర్‌లో గల శ్రీ రాఘవేంద్ర బాలు కుటీర్ పాఠశాలలో కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి భవనం నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వీవీ సుబ్బరాయుడు, అధ్యక్షుడిగా ఎస్కే మాబు సుభాని, జనరల్ సెక్రెటరీగా జి.శివ కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎస్.రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.అంజలి సుధ, ఎస్.సత్యానంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని 26 పాఠశాలలకు గాను 20 ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

